పుట్టపర్తికి చేరిన ప్రజారక్షణభేరి బస్సుయాత్ర

పుట్టపర్తి అర్బన్ : సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర పుట్టపర్తికి గురువారం రాత్రి చేరుకుంది. అనంతపురం, పెనుకొండ, హిందూపురం పట్టణాల మీదుగా కొనసాగిన బస్సు యాత్ర గోరంట్ల మీదుగా పుట్టపర్తికి చేరుకుంది. నాయకులు రాత్రికి ఇక్కడే బస చేసి శుక్రవారం ఉదయం 8:30 గంటలకు బయలుదేరి నల్లమాడ, కదిరి మీదుగా అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువుకు చేరుకుంటుంది. బస్సు యాత్ర చేపట్టిన నాయకులు ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సభల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను గుర్తించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక, వర్గాలను నల్ల చట్టాల ద్వారా చేపడుతున్న చర్యలను ఎండగట్టారు. ఈ బస్సు యాత్రలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణయ్య, గఫూర్, ప్రభాకర్ రెడ్డి, రమాదేవి, నాగరాజి, భాస్కరయ్య, ఓబులు, పెద్దన్న, నల్లప్ప, సత్య సాయి జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, స్థానిక నాయకులు బ్యాళ్ల అంజి, లక్ష్మీనారాయణ, పై పల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వింటూ..భరోసానిస్తూ..!

సమస్యలను వింటూ... విజ్ఞాపనలను స్వీకరిస్తూ.... భరోసానందిస్తూ... సిపిఎం ప్రజారక్షణ భేరి యాత్ర కొనసాగుతోంది. బుధవారం నాడు తాడిపత్రిలో ప్రవేశించిన యాత్ర రాత్రికి గుత్తికి చేరింది. గురువారం ఉదయం అక్కడి నుంచి ప్రారంభమైన యాత్ర పామిడి మీదుగా అనంతపురానికి మధ్యాహ్నానికి చేరుకుంది. అక్కడ బైపాస్‌లోని తపోవనంలో సిపిఎం నగర నాయకులు యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి బైకు ర్యాలీ ముందురాగా ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర వారి వెంట సాగింది. టవర్‌క్లాక్ వద్ద నుంచి పెద్దఎత్తున ప్రజలు రావడంతో అక్కడి నుంచి ప్రదర్శనగా సప్తగిరి సర్కిల్ మీదుగా బహిరంగ సభ ప్రదేశం నగర పాలక సంస్థ కార్యాలయం వరకు సాగింది. డప్పుల ప్రదర్శనతో సాగిన ప్రదర్శన అందరిలోనూ ఉత్సాహాన్ని నింపింది. అనంతపురం నుంచి శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ, హిందూపురం మీదుగా రాత్రికి పుట్టపర్తికి చేరుకుంది. ఈ ప్రాంతాల్లోనూ యాత్ర బృందానికి ఘనస్వాగతం లభించింది.

పెనుకొండ బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిపిఎం నాయకులు

- చైతన్యభరితంగా సాగుతున్న ప్రజారక్షణభేరియాత్ర
- రెండో రోజు అనంత, సత్యసాయి జిల్లాలో సాగిన యాత్ర
- అడుగడుగునా ఘనస్వాగతం

హిందూపురంలో బస్సుయాత్రకు స్వాగతం పలుకుతున్న సిపిఎం శ్రేణులు

పెనుకొండలో సమస్యలపై వినతిపత్రాలు అందిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, పెనుకొండ, హిందూపురం

సిపిఎం ప్రజారక్షణ భేరి బృందానికి పెద్దఎత్తున విజ్ఞాపనలు అందుతున్నాయి. పామిడి ప్రాంతంలో రైతు సమస్యలు రాగా, అనంతపురం నగరంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ ఏపి మున్సిపల్ వర్కర్స్, అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అందజేశారు. ఆటో డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. హమాలీ వర్కర్స్‌కు సమగ్ర చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. అనంతపురం నగరంలో అర్హులైన వారికి ఇళ్ల పట్టాలివ్వాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. పెనుకొండ పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పేదలు వినతిపత్రం అందజేశారు. రొద్దం మండలం కోగిర, శ్యాపురం, కంబాలపల్లి తదితర గ్రామాలకు చెందిన సాగుదారులు పట్టాలు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

కరువు కనిపించడం లేదా

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ.గఫూర్

రాయలసీమ జిల్లాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నా కనీస సమీక్షలు చేసే మంత్రులు కూడా కరువయ్యారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ విమర్శించారు. పంటలు ఎండిపోయి ఉపాధి లేక ఈప్రాంతం నుంచి వలసలు పోతున్నా పట్టించుకునే నాథుడు లేకుండాపోయారని విచారం వ్యక్తం చేశారు. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేనలకు కుర్చీల కొట్లాట తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదని చెప్పారు. అందుకే సిపిఎం ప్రజా రక్షణ యాత్ర ద్వారా ప్రజా సమస్యలను అజెండాలోకి తీసుకొస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కరువు మండలాల ప్రకటనలో అనేక మండలాలను మినహాయించడం సరైంది కాదని అన్నారు. ఒకే వాతావరణ పరిస్థితులున్నా మండలాలను కరువు మండలాల నుంచి ఎందుకు మినహాయించారో తెలియదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర నాయకురాలు నాగవేణి మాట్లాడుతూ పెనుకొండలో పేదలు ఇళ్ల స్థలాలను కొండగుట్టల్లో వేసుకున్నా అధికారులు తొలగించడాన్ని తప్పుబట్టారు. పెద్దలకు వందల ఎకరాలు కట్టబెట్టే పాలకులు పేదలకు మాత్రం సెంటు భూమి ఇవ్వడానికి సిద్ధపడటం లేదని విమర్శించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు దయా రమాదేవి మాట్లాడుతూ విభజన హామీలను అమలు చేయకుండా బిజెపి రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. వైసిపి, టిడిపి, జనసేనలు దానితో అంటగాగుతున్నాయని విమర్శించారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని వైసిపి అధికారంలోకి వచ్చాక విస్మరించిందని సిపిఎం రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు విమర్శించారు. విభజన హామీలను అమలు చేయకుండా ఆంధ్రరాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోడీ మోసం చేశారని సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు తెలిపారు. పరిశ్రమల పేరుతో సాగుభూములను తీసుకుని రైతులను మోసం చేశారు తప్పా ఒక్క పరిశ్రమా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య, వి.రాంభూపాల్, రాష్ట్ర నాయకులు నాగవేణి, సీనియర్ నాయకులు జి.ఓబుళు, సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, అనంతపురం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, సిపిఎం అనంతపురం నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, సిపిఎం నాయకులు సావిత్రి, దిల్‌షాద్, శ్రీసత్యసాయి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.పెద్దన్న, నాయకులు జంగాలపల్లి పెద్దన్న, జెడ్పీ శ్రీనివాసులు, కౌలురైతు సంఘం జిల్లా కన్వీనర్ కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు, సాగుపట్టాల కోసం పోరాటం

ఎం.ఇంతియాజ్, సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి.

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పేదలకు ఇళ్ల స్థలాలు... సాగు రైతులకు భూములు దక్కే వరకు వారికి అండగా పోరాటాలను ఉదతం చేస్తామని సిపిఎం శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ తెలిపారు. సత్యసాయి జిల్లాలో 5000 మందికి ఇళ్ల స్థలాలు కావాలని పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఊళ్లు నిర్మిస్తున్నామని చెప్పే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పేదలుకన్పించడం లేదాని ప్రశ్నించారు. పరిశ్రమల పేరుతో సాగుభూములను తీసుకుని రైతులకు తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారందరి పక్షాన సిపిఎం పోరాటం నిర్వహిస్తుందని చెప్పారు.

కార్మిక చట్టాలను అమలు చేయండి

నియోజకవర్గం పరిధిలో ఉన్న పారిశ్రామికవాడలో కార్మిక చట్టాలను అమలు చేసి, కార్మికులను ఆదుకోవాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ డిమాండ్ చేశారు. హిందూపురంలో బిపిఎల్ షోరూం వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. హిందూపురం పారిశ్రామికవాడలో కార్మిక చట్టాలు అమలుకాలేదన్నారు. కనీసవేతనాలు, పనిగంటలు జాడలేదన్నారు. లేపాక్షి మండలం కొండూరు వద్ద దళితులకు చెందిన 145 ఎకరాల భూమిని ఒక బిజెపి నేత అక్రమంగా అధికారులకు ముడుపు ఇచ్చి రాత్రికిరాత్రే రికార్డులను మార్చుకుని ఆక్రమించుకున్నా అధికార, ప్రతిపక్షాల నాయకులు నోరుమెదపలేదన్నారు. చిలమత్తూరు మండలంలో పరిశ్రమల కోసం భూములను తీసుకుని వెంచర్లు వేసి బహిరంగంగా అమ్ముతున్నప్పటికీ అధికారులు మౌనంగా ఉండడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

గఫూర్ | కృష్ణయ్య | ప్రభాకర్‌రెడ్డి | రమాదేవి | ఉమా మహేశ్వరరావు | ఓబులు | ఇంతియాజ్

పాలకులకు పట్టని గో(గూ)డు..!

గూడు చెదిరి..గుండె పగిలి..!

ఇళ్లు కూల్చడంతో రోడ్డున పడ్డ పేదలు

నిలువనీడలేని స్థితిలో కల్లూరు బాధితులు

ఇళ్లు కూల్చేయడంతో ఆరుబయటనే పిల్లలతో కలసి భోజనం చేస్తున్న కుటుంబం

ఇళ్లు లేక... ఎక్కడికి వెళ్లాలో తెలియకి చిన్నారితో కలిసి కన్నీటి పర్యవంతం అవుతున్న మహిళ

రెక్కల కష్టం చేస్తే తప్పా రోజుగడవని జీవనం వారిది. ప్రతి రోజూ పనికి వెళ్తేనే పూటగడిచే పరిస్థితి. పాలకులు, ప్రభుత్వాల వివక్షకు గురైన దళిత, గిరిజన పేదలు వారంతా. ఇలాంటి పేదలపై ప్రభుత్వం, అధికారులు కక్షగట్టారు. రెక్కల కష్టంతో ప్రభుత్వ స్థలంలో ఉండేందుకు ఏర్పాటు చేసుకున్న నివాసాలను అధికారులు జెసిబిలతో కూల్చిపడేశారు. బుధవారం వేకువజామున గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో అధికారులు సాగించిన కూల్చివేతల దమనకాండ 200 పేద కుటుంబాల్లో చీకట్లను నింపింది. నిలువనీడలేక పిల్లాపాపలు, వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వారంతా నిలువనీడలేక రోడ్డున పడ్డారు. ఎటు వెళ్లాలో పాలుపోక.. ఏమి చేయాలో దిక్కుతోచక కన్నీటి కష్టంతో బిక్కుబిక్కు మంటున్నారు. ఎవరిని కదిలించినా కన్నీరే సమాధానంగా వస్తోంది. ఎవరెళ్లినా 'సారూ మాకు న్యాయం చేయండి.. ఉండేందుకు కాసింత జాగా ఇప్పించండి'... అంటూ వేడుకుంటున్నారు.

ప్రజాశక్తి-గార్లదిన్నె

గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో పది సంవత్సరాలుగా నిర్మించుకున్న గుడిసెలను ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే అధికారులు కూల్చివేశారు. అక్కడ నివసిస్తున్న బుడగ జంగం తెగకు చెందిన నిరుపేదలంతా ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో పడ్డారు. బుధవారం ఉదయం నుంచి వారంతా ఆరబయటనే ఉంటున్నారు. గురువారం నాడు కూడా కూల్చివేసిన నివాసాల వద్దనే గడిపారు. ఉదయం కాలకృత్యాలు కూడా తీర్చుకునేందుకు కూడా అవకాశం లేక మహిళలు, వృద్ధులు అవస్థలు పడ్డారు. కనీస కూర్చేనేందుకు స్థలం లేక పిల్లలు ఎండ వేడిమిక సతమతం అయ్యారు. రాత్రికి చలికి జాగరణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇళ్లు కూల్చేయడంతో నిండు గర్భిణి అయిన కూతురితో దిక్కుతోచని స్థితిలో ఉన్న మహిళ

7న పుట్టపర్తికి ముఖ్యమంత్రి రాక : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఈ నెల 7వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టపర్తికి రానున్నారని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సంబంధిత అధికారులతో గురువారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్‌తో పాటు సమావేశంలో ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒకొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్‌ఆర్ రైతు భరోసా, పిఎం కిసాన్ పథకంలో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి 7వ తేదీ ఉదయం 9:30 గంటలకు సత్యసాయి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారన్నారు. పుట్టపర్తి వై జంక్షన్ పోలీస్ పేరెడ్ గ్రౌండ్ రహదారుల వెంట పటిష్టమైన బారికేట్లు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ప్రముఖులకు పాసులు మంజూరు చేసే కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పటిష్టమైన భద్రతా చర్యలు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కాన్వాయ్‌కి సంబంధించి వివరాలు రవాణా శాఖ అధికారి ఆధ్వర్యంలో చేపట్టాలని ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్, మునిసిపాలిటీ ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం, పారిశుధ్య సౌకర్యం కల్పించాలన్నారు. డిఎంహెచ్‌ఒ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, అంబులెన్స్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మరొకసారి ఉన్నత అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. పోలీస్ పేరెడ్ సమీపంలోని వై జంక్షన్ లో ఉన్న ప్రాంతంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా అన్ని శాఖల అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రెండు లక్షల డెబ్బైవేల రైతులకు రైతు భరోసా క్రింద ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద లబ్ధిచేకూరుతుందన్నారు. లబ్ధిదారులతోపాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొనే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కృష్ణారెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

పలు కార్యక్రమాలకు హాజరైన రఘువీరారెడ్డి

మడకశిర : నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు మాజీ మంత్రి, సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి హాజరయ్యా రు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్క రూ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్ర మాలు చేపట్టాలని సూచించారు. పట్టణంలోని మారుతీ నగర్‌లో నిర్వహించిన ఓ పూజా కార్యక్రమానికి హాజరైన రఘురా మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ దైవభక్తి అవసరమన్నారు. ప్రజలు భక్తి భావాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాథ్ దంపతులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలపై అప్రమత్తత అవసరం

డిఎంహెచ్‌ఒ ఎస్‌వి కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ శిశు మరణాలు జరగకూడదని బిడ్డకు జన్మనిస్తూ ఏ తల్లి మరణించరాదని వాటిపై అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్‌ఒ ఎస్‌వి కృష్ణారెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో మాతా శిశుమరణాలపై సమీక్ష సమా వేశం నిర్వహించారు. డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ మొదటి 3 నెలలలోపు ప్రతి గర్భిణి పేరును నమోదు చేసి ప్రమాదకర లక్షణాలు కలిగిన గర్భిణిని గుర్తించి ప్రత్యేకమైన పరీక్షలు, సేవలు అందించాలన్నారు. ప్రతి నెల 9వ తేదీన జరిగే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గ్రూపు సమావేశం ఏర్పాటు చేసి ప్రతి గర్భిణికి అన్ని ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు తిప్పేంద్రనాయక్, సెల్వియ సొలొమాన్, మంజువాణి, పద్మలత, జోవెల్ వెస్లీ, ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి, 108 జిల్లా మేనేజర్ సంజీవరెడ్డి, 108 కో ఆర్డినేటర్ మహేష్ పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డిఎంహెచ్‌ఒ కృష్ణారెడ్డి

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి

ప్రజాశక్తి-మడకశిర

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతులు రొళ్ల సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ధర్నా, రాస్తారోకో కార్యక్రమాలు చేపట్టారు. రైతులు మాట్లాడుతూ అప్పులు చేసి బోర్ల కింద వేరుశనగ, మొక్క జొన్న, తదితర పంటలతో పాటు పూల తోటలు సాగు చేయగా విద్యుత్ సమస్యతో పంటలను నష్టపోవా ల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని అధికారులు ఆర్భాటం చేస్తున్నారు కానీ రెండు మూడు గంటలు కూడా సరఫరా ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరవధికంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చేంత వరకూ కదిలేదే లేదని భీష్మించుకు కూర్చొన్నారు. చివరకు అధికారులు జోక్యం చేసుకొని విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలపడంతో రైతులు శాంతించారు. ధర్నాలో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్ గురుమూర్తి, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు బాలకృష్ణ, మల్లికార్జున్, బిసి సెల్ అధ్యక్షులు నాగరాజు, రామకృష్ణ, భరత్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న రైతులు

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబానికి చెక్కు అందజేత

గోరంట్ల రూరల్ : ఇటీవల కర్నాటకలోని చిక్కబల్లాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని వానవోలు గ్రామానికి చెందిన వెంకటాద్రి, బోయ లక్ష్మి దంపతులు మృతి చెందారు. వారికి రూ. 5 లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయగా గత వారం ఎమ్మెల్యే శంకరనారాయణ వెంకటాద్రికి సంబంధించిన చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. బోయ లక్ష్మికి మంజూరైన రూ. 5 లక్షల చెక్కును గురువారం ఎమ్మెల్యే వానవోలు వెళ్లి వారి తల్లిదండ్రులు నాగప్ప, లక్ష్మీనరసమ్మ అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయ కులు, సింగిల్‌విండో అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, సర్పంచి శ్రీరాములు, ఉప సర్పంచి బుల్లెట్ బాబు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'ని జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి-పెనుకొండ

నియోజకవర్గంలో 45 రోజుల పాటు నిర్వహించే 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యాచరణ, ఇంటింటి ప్రచార కార్యక్రమంపై నాయకులతో సమావేశమాయ్యారు. మినీ మేనిఫెస్టో, స్థానికంగా, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, స్థానిక ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలు, వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు.

'నరకాసుర' చిత్రాన్ని ఆదరించండి

ప్రజాశక్తి-పెనుకొండ

తాను నటించిన చలనచిత్రం 'నరకాసుర' శుక్రవారం(నేడు) విడుదల కానుందని, ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని చిత్ర కళాకారిణి గాయత్రిరవిశంకర్ కోరారు. పట్టణంలో గురువారం ఆమె మాట్లాడుతూ తెలుగు, మలయాళం, కన్నడ, తమిళ, హిందీ భాషల్లో విడుదలవుతున్న ఈ చిత్రం పట్టణంలోని శ్రీనివాసా థియేటర్‌లో ఉదయం 10.30 గంటల షోతో మొదలవుతుందని తెలిపారు. పలాస సినిమాతో పేరుగాంచిన రక్షిత్ అట్లూరి కథ నాయకుడిగా, ప్రముఖ నటుడు నాజర్, తదితర తారాగణంతో మధ్యప్రదేశ్ అడవుల్లో అద్భుతమైన కథనంతో సాగుతుందని తెలిపారు. నర్మదా నది తీరంలో సుందరమైన దృశ్యాలు చిత్రీకరించారన్నారు. ఇది ఓ గొప్ప ప్రయోగాత్మక, సందేశాత్మక చిత్రమన్నారు. సకుటుంబ సమేతంగా చక్కగా నవ్వుకుని, నివ్వెర పోయేలాంటి యాక్షన్ చిత్రం అన్నారు. హీరో తల్లిగా నటించినట్లు తెలిపారు. చిత్రంలోని పాటలు అద్భుతంగా ఉన్నాయ న్నారు.

చిత్ర బృందంతో గాయత్రి రవిశంకర్

అవార్డు అందుకుంటున్న మదన్మోహన్‌రెడ్డి

రాడ్స్ మాదన్‌మోహన్‌రెడ్డికి అవార్డు

తలుపుల : రూరల్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ సొసైటీ(రాడ్స్) ద్వారా రాయలసీమ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించినందుకు రాడ్స్ అధ్యక్షులు బండ్లపల్లి మదన్మోహన్ రెడ్డికి అవార్డు వరించింది. ఆయనకు ఇండియా గ్లోబల్ యూనిక్రేటబుల్ లీడర్షిప్ అవార్డును యుఎస్ఎ ఇండియా ఎస్ఎం అధినేత డాక్టర్ పులివర్తి హైదరాబాదులో అందజేశారు. ఈసందర్భంగా మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ తమపై మరింత బాధ్యత పెరిగిందని రాయలసీమ ప్రాంత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అనేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

బాధితుడికి పరామర్శ

గుడిబండ : మండల పరిధిలోని కెకె పాలెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి లక్ష్మీనరసప్ప డెంగీ జ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొంది అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి గురువారం ఆయన ఇంటికెళ్లి పరామర్శించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండలం కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

తలుపుల : మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు సభ్యులు అధికారులను కోరారు. స్థానిక జీవనజ్యోతి మండల సమైక్య కార్యాలయంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు తమ గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వర్ రెడ్డి, ఇఒఆర్‌డి శకుంతలతో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మండల కన్వీనర్‌కు పరామర్శ

గోరంట్ల : టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్ కుమారుడు ఈశ్వర రాయల్ పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి గురువారం పులేరు గ్రామం వెళ్లి ఈశ్వర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట హిందూపురం పార్లమెంటు కార్యదర్శి దేవానరసింహులు, శ్రీనివాసులు, జయరాం, మరిరెడ్డిపల్లి నరసింహులు, మల్లికార్జున, గంగంపల్లి నరసింహులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని ఒకటవ సచివాలయంలో పారిశుధ్యకార్మికులకు దుస్తులు గ్లౌజులు సబ్బులు, కొబ్బరినూనె తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శి మంజుల, సర్పంచి లక్ష్మిదేవి చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమత క్లినిక్ ప్రారంభం

హిందూపురం : పట్టణంలోని డిబి కాలనీలో డాక్టర్ సమత నేతృత్వంలో నిర్వహిస్తున్న సమత క్లినిక్‌ను పట్టు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనాపురం వెంకట్రామిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పట్టణంలో హైపర్ ఎసిడిటీ, గ్యాస్ట్రో ఎంటరైసిస్, పెప్టిక్ అల్సర్ తదితర వ్యాధులకు డాక్టర్ సమత ఆధ్వర్యంలో మొట్టమొదటిసారి ఆసుపత్రి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఒపిడిఆర్ శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి, సిద్దారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, జయరామిరెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

5న జిల్లా కురుబ కమిటీ ఎన్నిక

పుట్టపర్తి క్రైమ్: జిల్లాలో ఈనెల 5న సాయి ఆరామంలో జరిగే సమావేశంలో జిల్లా కురుబ కమిటీ ఎన్నిక జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం నాయకుడు సామ కోటి ఆదినారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కురుబ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాల కురుబలను కలసి ఆహ్వానించినట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో జిల్లా కమిటీ ఏర్పడితే కురుబల సమస్యలు సాంఘికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వారి అభివృద్ధి కోసం కమిటీ పని చేస్తుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నాయకులు సమావేశానికి హాజరై కమిటీ ఎన్నికకు సహకరించాలని ఆయన కోరారు.

అందరికీ ఉపాధి పనులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులను కల్పిస్తామని ఎంపీడీవో సౌజన్యకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె గురువారం మండల పరిధిలోని రేగాటిపల్లి గ్రామంలో కూలీలతో మాట్లాడారు. ఉపాధి పనులను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కొన్ని కుటుంబాల వారికి వంద రోజులు పూర్తి అయ్యాయని తెలుపగా త్వరలో కరువు మండలాలకి అదనంగా 50 రోజులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ లోకన్న, ఏఈ రమణ, ఏపీవో అనిల్ కుమార్ రెడ్డి, కార్యదర్శి సువర్ణ, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులతో ప్రాధాన్యత భవన నిర్మాణాలు, గృహ నిర్మాణాల పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాధాన్యత భవన నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఆయా శాఖల వారు నిర్దేశించిన గడువులోగా భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెల 5వ తేదీ లోపల పూర్తి అయిన 132 భవనాలను ఆయా శాఖల వారికి స్వాధీన పరచాలని చెప్పారు. గ్రామ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మండల అధికారులు, ఎంపీడీవోలు, ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. అలాగే జిల్లాకు కేటాయించిన గృహ నిర్మాణాల పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఎస్ఇ గోపాల్ రెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బస్సుయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ బేరి బస్సు యాత్ర శుక్రవారం కదిరికి రానుందని ఈ యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు బడా సుబ్బి రెడ్డి, పట్టణ కార్యదర్శి జివిఎల్. నరసింహులు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతతత్వ విధానాలు అవలంభిస్తోందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రవేటికరణ ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణపై రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ యాత్ర కొనసాగుతోందన్నారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో నిర్వహించే బహిరంగసభకు కదిరి ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నల్లమాడ : నల్లమాడ మండల కేంద్రంలో శుక్రవారం కొనసాగనున్న సిపిఎం బస్సుయాత్రను విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి గోవింద్ కోరారు. ఈ బస్సు యాత్రలో సిపిఎం కేంద్ర, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని రైతు కార్మిక సమస్యలపై ప్రసంగిస్తారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కదిరి రాయచోటి ప్రధాన రహదారిని బాగుచేయాలి

కదిరి అర్బన్ : కదిరి నుండి నంబులపులకుంట వరకు రోడ్డు అధ్వానంగా ఉందని ఈ రహదారిని బాగు చేయాలని సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌డిఒ వంశీకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్ఎల్ లిబరేషన్ డివిజన్ ఇన్‌ఛార్జి రాజేష్, అధ్యక్షులు నరసింహ,నాయకులు నాగార్జున, హరి, కార్తీక్‌నాయక్, కిరణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలి

హిందూపురం : అంతరించి పోతున్న చెట్లను కాపాడుకోవడమే కాకుండా...శుభ కార్యక్రమాల సందర్భంగా దాని జ్ఞాపకార్థం మొక్కలు నాటడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పర్యావరణ వేత్త భాస్కర్‌రెడ్డి అన్నారు. ప్రధాన తపాల కార్యాలయంలో పోస్ట్‌మాస్టర్ విధులు నిర్వహిస్తున్న మార్కెండేయులు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సడ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శోభ, నాగవేని, కల్పన, హెడ్ పోస్ట్ ఆఫీస్ సిబ్బంది నింగేశ్వర, రహమతుల్లా, కిషోర్, గణేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు రైతు గ్రామీణ సంతను సద్వినియోగం చేసుకోండి

అధికారులతో మాట్లాడుతున్న ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి ముదిగుబ్బ

స్థానిక సొసైటీ ఆర్థిక అభివృద్ధి, రైతుల ఉత్పత్తులు విక్రయించుకోవడానికి నిర్మించిన నాబార్డ్ రైతు గ్రామీణ సంత (రూరల్ హట్) కుటీరాలను సద్వినియోగం అయ్యేలా వినియోగంలోకి తీసుకురావాలని ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, స్థానిక సొసైటీ అధ్యక్షులు బయపరెడ్డికి సూచించారు. ఏడీసీసీ ఛైర్మన్ లిఖిత స్థానిక ఎడిసిసి బ్యాంకును, సొసైటీని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ఆవరణలో నిర్మించిన రూరల్ హట్లను పరిశీలించారు. రైతులు పండించిన తమ ఉత్పత్తులను దళారులతో ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించుకొని లబ్ధి పొందడానికి, సొసైటీ ఆర్థిక స్వయం సమృద్ధి ఆదాయ కల్పన పొందడానికి మూడు సంవత్సరాల క్రితం రూ. 16.50 లక్షల నాబర్డ్ నిధులతో సొసైటీ ఆవరణలో 24 రూరల్ హట్‌లను నిర్మించారన్నారు. అయితే వాటిని నేటికీ వినియోగించకపోవడంతో సొసైటీకి, రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగడం లేదని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకునేలా వినియోగం లోకి తీసుకురావాలని సొసైటీ ఛైర్మన్ బయపరెడ్డికి సూచించారు. అలాగే గతంలో నాబార్డ్ నిధులతో మంజూరైన పెట్రోల్ బంకు నిర్మాణం ప్రగతిని, నిర్మాణం గురించి ఆరా తీశారు. పట్టణ నడిబొడ్డున అత్యంత విలువైన విశాలమైన స్థలంలో సొసైటీ ఆర్థిక అభివృద్ధికి వినియోగపడేలా వ్యాపార సముదాయ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి తమకు అందజేస్తే వాటికి అనుమతులు, నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీసీ జనరల్ మేనేజర్ సురేఖ రాణి, ఆప్కాబ్ డిపిడిఎం తేజస్విని, స్థానిక ఎడిసిసి బ్యాంక్ మేనేజర్ వెంకటరమణమ్మ, సహాయక మేనేజర్ కీర్తి సాగర్, బ్యాంకు సిబ్బంది, సొసైటీ సీఈవో శ్రీనివాసులు, వైకుంఠరెడ్డి, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థిని

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తమ పాఠశాలలో 10వతరగతి చదువుతున్న విద్యార్థిని విష్ణుప్రియ ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణరెడ్డి, పిఇటి వీర తెఇపారు. అనంతపురంలోనిఆర్డీటీ స్టేడియంలో అక్టోబరు 30న జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న విష్ణుప్రియ ప్రతిభ కనబరచిందన్నారు. ఈ విద్యార్థిని నవంబరు 3,4,5 తేదీలలో కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరులో జరిగే అండర్-17 ఫుట్‌బాల్ జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటుందని వారు తెలిపారు. విష్ణుప్రియను హెచ్ఎం, పిఇటితో పాటు ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, తోటి విద్యార్థులు అభినందించారు.

అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ కొండయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటమయ్య మాట్లాడుతూ సరైన సమయంలో వర్షం రాకపోవడంతో రైతులు అన్ని రకాల పంటలను నష్టపోయారన్నారు. ఈనేపథ్యంలో రైతులను అన్ని విధాల ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు అడపాల వేమనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి. రమణ, నాయకులు ముత్యాలప్ప, కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

వివాదాస్పద స్థలంలో బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి - పరిగి

ఇటీవలే పరిగి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని సర్వేనెంబర్ 368/2లోని 3.65ఎకరాల భూమిలో రెవెన్యూ అధికారులు పాతిన రాళ్లను రాత్రికి రాత్రి పగలగొట్టి స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించిన సంఘటన తెలిసిందే. ఈ సంఘటనను సీరియస్ గా తీసుకున్న రెవిన్యూ అధికారులు సంఘటనకు పాల్పడిన వ్యక్తులపై తాసిల్దార్ సౌజన్య లక్ష్మి ఫిర్యాదుతో 447,427 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అంతేకాకుండా ఈ స్థలం ప్రభుత్వ ఆధీనంలో ఉందని హెచ్చరిక బోర్డులను నాటారు. అయితే ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని భూ నిర్వాసిత రైతులు ఆరోపిస్తున్నారు.

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి '

కరపత్రాన్ని అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి బత్తలపల్లి

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఇలాంటి పరిస్థితుల్లో టిడిపితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన బత్తలపల్లి మండల కేంద్రంలో గురువారం పర్యటించారు. బత్తలపల్లిలోని మైనారిటీ కాలనీ, కురుబ కాలనీ, పాత ఊరు, బోయ వీధి తదితర కాలనీల్లో ఆయన పర్యటించారు. స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రతిరోజు 'గుడ్ మార్నింగ్' చేస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. కనీసం డ్రైనేజీ సమస్యలు కూడా పట్టించుకునే వారు లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, జక్కంపూటి నాగభూషణం, రంగా నాయుడు, బోయపాటి అప్ప స్వామి నాయుడు, ఎల్ఎస్ సుభాన్, టైలర్ రఫీ, సులేమాన్, గుండుసాబ్, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : చంద్రబాబునాయుడికి మధ్యంతర బెయిల్ రావటంపై టిడిపి 25వ వార్డు ఇన్‌ఛార్జి భీమనేనిప్రసాద్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని 25వ వార్డు లక్ష్మీ చెన్నకేశవపురంలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డంసూరి, క్లస్టర్ రామాంజి, రేనాటిబాబు, బాషా తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : టిడిపి రూపొందించిన మినీ మేనిఫెస్టోను బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిడిపి నాయకులు సూచించారు. ఈ మేరకు టిడిపి నాయకులు మండలకేంద్రంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రమేష్ బాబు, ప్రభాకర్ నాయుడు, తుమ్మల మనోహర్, కృష్ణమూర్తి యాదవ్, నాగలగుబ్బ శేఖర్, తుమ్మల సూరితో పాటు మండలంలోని నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పరిశీలించుకోండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాను పరిశీలించుకోవాలని ఆర్డీవో రమేష్ రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశపు భవనంలో గురువారం పట్టణ, రూరల్ బిఎల్ఒలు, సూపర్వైజర్లకు ఓటరు జాబితాపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బిఎల్ఒలు ఓటరు జాబితాను పరిశీలించి అందులో డబుల్, డెత్, సిఫ్టెడ్ తదితరవాటిపై పక్కాగా విచారణ చేసి ఫారం-7 దరఖాస్తు చేయాలన్నారు. కొత్తగా నమోదైనా వాటికి సంబంధించిన ఆధారాలు ఇప్పించుకుని నివాసం ఉన్నారో లేదో విచారణ చేసి వాటిని కూడా యాప్లో ఫార్వర్డ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ యుగేశ్వరిదేవి, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా చెరువు,డ్యాంల గణన

ప్రజాశక్తి - బత్తలపల్లి

: మండలంలో వాటర్ బాడీ గణనను పక్కా ఆధారాలతో చేపట్టాలని డివిజనల్ గణాంక అధికారి గోపాల్ తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీ నరసింహశర్మతో కలసి వాటర్ బాడీ గణనపై వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న చిన్న చిన్న చెరువులు,ఊటచెరువులు, చెక్‌డ్యాంల గణనను సర్వే నెంబర్ల ఆధారంగా లెక్కించాలన్నారు. వివరాలన్నిటిని చెరువులు, కుంటల వద్దకే వెళ్లి యాప్ లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

బాబుకు కండీషనల్ బెయిలే... : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

చంద్రబాబుకు కండీషనల్ బెయిల్ మాత్రమే ఇచ్చారని మధ్యంతర బెయిల్ రాగానే టీడీపీ సంబరాలు జరుపుకోవడంలో అర్థం లేదని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక అన్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యలయంలో ఆమె మాట్లాడారు. హైకోర్టు బాబుకు కండీషనల్ బెయిల్ ఇచ్చిందని చికిత్స తర్వాత చంద్రబాబు జైలుకెళ్లాల్సిందేనని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నిర్దోషి అయితే ఆధారాలు బయటపెట్టాలన్నారు. జగన్ వ్యవస్థలను మేనేజ్ చేసి ఉంటే చంద్రబాబుకి మధ్యంతర బెయిల్ ఎలా వచ్చేదని ప్రశ్నించారు. దేశంలో ఏ ఖైదికి అయిన అనారోగ్యంగా ఉంటే బెయిల్ మంజూరు చేస్తారన్నారు. దానిని పట్టుకుని మధ్యంతర బెయిల్ విషయంలోనూ రాజకీయం చేయడం సిగ్గుచేటని అన్నారు. విజయోత్సవ ర్యాలీలు చేసుకోవడం హాస్యస్పదంగా ఉందన్నారు.

రస్తా వివాదం పరిష్కారం

గాండ్లపెంట : మండల పరిధిలోని కంతంపల్లి వద్ద నెలకొన్న రాస్తా సమస్యను ఎస్ఐ వెంకటనారాయణ పరిష్కరించారు. ఈ మేరకు ఆయన తన సొంత నిధులతో దారి ఏర్పాటు చేయించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాల నుంచి దారి సమస్య ఉందన్నారు. కంతంపల్లి రైతులు, దళిత రైతులు పొలాలకు వెళ్లాలంటే పట్టా భూముల్లో వెళ్లకూడదని ఆ గ్రామ ప్రజలు రైతులు అడ్డు చెప్పడంతో సమస్య నెలకొందన్నారు. సమస్య తన దృష్టికి రావడంతో రైతులను పిలిపించి మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. తన సొంతనిధులతో దాదాపు కిలోమీటరు దూరం జెసిపితో చెట్లు తొలగించి దారి ఏర్పాటు చేయించనట్లు తెలిపారు. దీంతో గ్రామస్తులు ఎస్ఐకు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

మట్కాబీటర్ అరెస్టు

మడకశిర : పట్టణంలో గురువారం పోలీసులు ఓ మట్కా బీటర్‌ను అరెస్టు చేసి నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారని ఎస్ఐ లోకేష్ తెలిపారు. గుడ్డంపల్లి గ్రామానికి చెందిన జి.రంగధామ పట్టణంలోని ఖాజా వస్త్ర దుకాణంలో పని చేస్తూ రహస్యంగా మట్కా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేసి అరెస్టు చేశారన్నారు. అతడి నుంచి మట్కా చీటీలు, రూ. 29,980 నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మండల వ్యాప్తంగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హోంగార్డు బసవరాజు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

కొత్తచెరువు : మండల పరిధిలోని లోచర్ల గ్రామానికి చెందిన శివ కుమార్ అనే విద్యార్థి కనిపించం లేదని అతని తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఎస్ఐ సురేష్ బాబు.తెలిపారు. గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు శివకుమార్ కొత్తచెరువు లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు బుధవారం పాఠశాలకు వెళ్లపోవటంలో కుటుంబసభ్యులు మందలించారు. అయితే ఆరోజు సాయంకాలం నుండి శివకుమార్ కనిపించకుండా ఎక్కడికో వెళ్లిపోయాడని విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జిల్లాలో సెబ్ దాడులు

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోని పలు గ్రామాల్లో సెబ్ అధికారుల సమక్షంలో గురువారం దాడులు నిర్వహించి పలు కేసులను నమోదు చేశారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశం మేరకు జిల్లాలో ఉమ్మారంగ దాడులు కొనసాగించారు. ఇందులో భాగంగా హిందూపురం సెబ్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకుని సేవామందిరం పరిధిలో , హిందూపూర్ లో ఎన్డిపిఎల్ కేసు 75 కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మడకశిర సెబ్ స్టేషన్ పరిధి లో నరసప్ప అనే వ్యక్తి ఇంటి ముందు 20 కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా కదిరి సెబ్ స్టేషన్ పరిధి బాలప్పగారితండాలో 105 బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కొడికొండ చెక్ పోస్ట్‌లో వాహనాల తనిఖీలో ద్విచక్రవాహనం మీద 48 కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ద్విచక్రవాహనం సీజ్ చేసి, మద్యం స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్రగాయాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని రైల్వేఅండర్ బ్రిడ్జిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఆసార్ వీధికి చెందిన మున్వర్ కుమారుడు ఇంటర్ విద్యార్థి మహమ్మద్ సిద్దిక్ ద్విచక్రవాహనంలో దుర్గానగర్ లోని బంధువులు ఇంటికి వెళ తున్నాడు. దుర్గానగర్ సమీపంలో అండర్ బ్రిడ్జిపై రాగానే బైకు అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సిద్దిక్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి ఆత్మహత్య

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని గోకులంలో అపార్ట్‌మెంట్ మీద నుండి పడి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... గోకులంలోని సాయి నివాస్ అపార్ట్‌మెంట్ లో వాచ్‌మెన్ గంగాద్రి కుమార్తె గౌరీ (17) అపార్ట్మెంట్ పై భాగం నుండి దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన తల్లిదండ్రులు ఆమెను హుటాహుటిన సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు.

కరువు మండలాల ప్రకటనలో అన్యాయం

నల్లచెరువు : కరువు మండలాల ప్రకటనలో ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరాములు విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కదిరి నియోజకవర్గంలోని మండలాలను కరువులో ఆదుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పరిస్థితి ఇలానే కొనసాగితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అలాగే శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించే సిపిఎం రైతు రక్షణ భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమేష్, ఆదినారాయణ, రామకృష్ణ, శ్రీనివాసులు, ఆంజనేయులు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద గురువారం రాత్రి సిఐ అశోక్ కుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్రవాహనాలను ఆపి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. లైసెన్సు లేని వాహనాలకు జరిమానా విధించారు. ప్రతిఒక్క వాహనదారుడు లైసెన్సులు కలిగి ఉండాలని లేకపోతే జరిమానా విధిస్తామని సిఐ హెచ్చరించారు.

ఆర్‌బికె భవనం ప్రారంభం

నంబులపూలకుంట : మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె ఛైర్మన్ ఆదిరెడ్డి, ఎఒ లోకేష్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కార్గో డోర్ డెలివరీలో కదిరి డిపో ముందంజ

కదిరి టౌన్ : కార్గో డోర్ డెలివరీ కార్యక్రమంలో కదిరి ఆర్టీసీ డిపో ఉద్యోగులు ముందంజలో నిలిచినట్లు కదిరి డిపో మేనేజర్ మైనొద్దీన్ తెలిపారు. డోర్ డెలివరీలకు అత్యంత ప్రాముఖ్యతనిస్తూ. ప్రస్తుతం జరుగుతున్న కార్యక్రమంలో కదిరి డిపో ఉద్యోగులు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయి ముందంజలో నిలిచారన్నారు. అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్ 20, ఎన్ఎంయుఎ డిపో కార్యదర్శి ఎస్.బైరిశెట్టి 15 డోర్ డెలివరీలను డిపో మేనేజరుగారి ద్వార బుక్ చేయించారన్నారు. కదిరి డిపోలో వున్న 471 మంది ఉద్యోగులు ప్రతి ఒక్కరూ కనీసం 3 డోర్ డెలివరీలను బుక్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమములో కార్గో సూపర్వైజరు శ్రీనివాసులు, ట్రాఫిక్ సూపర్వైజరు ఆర్.నాగసుబ్బయ్య, ఆఫీసు సిబ్బంది అబ్బాస్, సుబ్బారెడ్డి, రియాజుల్లా తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం

మడకశిర : రొళ్ల మండల డిప్యుటీ సర్వేయర్‌గా పని చేస్తున్న ఎన్.కిరణ్‌కుమార్ సాధారణ బదిలీపై మడకశిర మున్సిపాలిటీ కార్యాలయానికి వెళుతున్న సందర్భంగా గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.హాసీనాసుల్తానా, డిప్యూటీ తహశీల్దార్ ఎం.భాగ్యలక్ష్మి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సిఎం జగన్‌ది పైశాచిక ఆనందం '

గోరంట్ల : టిడిపి అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి సిఎం జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆ పార్టీ మండల నాయకులు మండిపడ్డారు. గోరంట్లలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎం జగన్ నాలుగున్నరేళ్లుగా కల్తీ, నాశిరకమైన మద్యం విక్రయించి లక్షల కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. అలాంటి వ్యక్తి టిడిపి పాలనలో మద్యం కుంభకోణం జరిగిందంటూ చంద్రబాబు, మాజీ మంత్రి కొల్లు రవీంద్రలపై తప్పుడు కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. సమావేశంలో బిసి సెల్ ఉపాధ్యక్షుడు జయరాం, వాల్మీకి స్టేట్ డైరెక్టర్ చంద్ర, అజమతుల్లా, గిరిధర్‌గౌడ్, వేణు, శ్రీనివాసులు, మల్లికార్జున, మరిరెడ్డిపల్లి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-లేపాక్షి

అవినీతి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా గురువారం కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవినీతి నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దేశంలో అవినీతిని ఏవిధంగా నిర్మూలించాలి, అవినీతిని నియంత్రిస్తే ప్రజలకు కలిగే ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి శివన్న, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, వైస్ ఎంపిపి అంజనరెడ్డి, ఆర్ఐ జయలక్ష్మి, మాజీ సర్పంచి వెచ్చమ్ రవి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.